



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 42 | కర్నూలు | గురువారం మార్చి 19 2026 6






Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన సిఎం**

**12.75 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని వెల్లడి**





అమరావతి,మార్చి18(శ్రీచక్ర) :దివ్యాంగ శక్తి పథకం ద్వారా లక్షల మందికి మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల గౌరవాన్ని పెంచేంద ంకు ఈ పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్ధిదారులతో సీఎం మాట్లాడారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో ప్రయాణించటం ఆనందంగా ఉందని చంద్రబాబు అన్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వారని తెలిపారు. గతంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని ప్రస్తావించారు. ట్రైసైకిళ్లతో పాటు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నామని స్పష్టం చేశారు.

# అనుకున్న సమయానికి పోలవరం పూర్తి

**గత పాలకులు తీరుతో ప్రాజెక్టులో జాప్యం**

**నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం**

**నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత**



అమరావతి,మార్చి18(శ్రీచక్ర) పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులనునమ్మవద్దని సూచించారు.

# పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

**ఇలాంటి వాళ్లను పార్టీ ఎందుకు మోయాలి**

**తిరుపతి ఎమ్మెల్యేలతో సిఎం చంద్రబాబు**

అమరావతి,మార్చి18(శ్రీచక్ర) మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌పై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి వాళ్లను మోయాలా..? అంటూ ఈ సమావేశంలో ఆయన అసహనం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహరించారన్నారు. అసలు ఆ పార్టీలకు వెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వాళ్లు ఎంతటి పెద్ద వాళ్లైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నానని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. క్రమశిక్షణ, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో నాయకులంతా క్రమశిక్షణతో మెలగాల్సిందేనని.. ఎవరికీ వెసులుబాటు ఉండదని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

**త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు**

**సిబ్బంది నియామకం పనులు పూర్తి**

**రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



న్యూఢిల్లీ,మార్చి18(శ్రీచక్ర) : త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు విఎంఆర్‌డిఎ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009–2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025–26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ – గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ – గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

**రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ**

**సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం**

**రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ**

**మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం**

**దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు**

న్యూఢిల్లీ,మార్చి18(శ్రీచక్ర) :రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.



రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు .ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూని వర్సిటీ లాంటిద న్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచ రణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

**ఉచిత బస్సు సౌకర్యంతో పెరిగిన గౌరవం**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



శ్రీకాకుళం,మార్చి18(శ్రీచక్ర) : రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొత్తగా ప్రారంభించిన 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణస్తూ ఎంతో లబ్ధిపొం దుతున్నారన్నారు. మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల మేనిఫె స్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఆగస్టు 15న ప్రారం భించిన 'స్త్రీ శక్తి' పథకం అద్భుత విజయాన్ని అందుకుంది. అదే బాటలో ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' సూపర్ హిట్ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించారంటే ఈ పథకం ఎంతటి ఘన విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మొత్తం 12.70 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. ప్రస్తుతం 2 లక్షల మంది మాత్రమే పాస్‌లు కలిగి ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 42 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వారందరికీ పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం బస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వంద శాంతం మందికి పాస్‌లు అందజేసేలా పక్రియను సరళీకరణ చేస్తాం' అని అన్నారు.

# అల్పపీడన ప్రభావంతో ఏపిలో భారీ వర్షాలు

**పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు**

విశాఖపట్నం,మార్చి18(శ్రీచక్ర) :అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగా లులతో కూడిన వర్షాలు పడే అవ శం ఉందని వెల్లడించారు. విశాఖప ట్నం కేంద్రంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపారు. వాతావరణంలో చోటుచే సుకున్న మార్పులతో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు బలంగా వీస్తాయని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రాబోయే మూడు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులకు పలు కీలక సూచనలు చేసింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా అమలాపురం, తణుకు, రాజోలు, భీమవరం, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, నంద్యాల పరిసర ప్రాంతాలు, ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అధికారులు తెలిపారు. నూజివీడు ప్రాంతంలో ఇప్పటికే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభా వాన్ని చూపించనున్నాయి. ఏలూరు జిల్లా, పరిసర ప్రాంతాల్లో సుమారు 35,000 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఈదురుగాలుల కారణంగా మామిడి పూత రాలిపోతోంది. మామిడి పిందెలు నేలపై పడిపోతున్నాయని, దీనివల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# సంపాదకీయం

## నట్టింట్లో కల్తీ రక్కసి

భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తు న్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం.. భారత్‌లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణా ల అమలులో ఆంధ్రప్రదేశ్ గత ఐదేళ్ల కాలం లో అట్టడుగు స్థానానికి పడిపోయింది. తెలు గు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు. వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలు గు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల మైలార్‌దేవ్‌పల్లి, లాలాగూడల్లో అపరిశు భ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, బంజారాహిల్స్ వంటి సంపన్నుల నివాస ప్రాంతంలో 'ఫ్రైడ్ డెయిరీ' పేరిట సాగుతున్న కల్తీ నెయ్యి దందా మరో ఎత్తు. కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడి న కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్సజన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్‌ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాల ను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్‌స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాంతక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్ట్‌లు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేల డం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించు కోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు. ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కాన్ల కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తా ల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే.ల కల్తీ కోసం అక్రమార్కులు యూరి యా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు.

# "దివ్యాంగ శక్తి" పథకంతో దివ్యాంగులకు లబ్ధి :జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి


## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం" కుడా " చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు





కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న " దివ్యాంగ శక్తి " పథకం దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుందని , పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. కర్నూలు కొత్త బస్ స్టాండ్‌లో నిర్వహించిన దివ్యాంగ శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అందుబాటులో సేవలను మరింత విస్తరించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్ ద్వారా జిల్లాలోని 30,150 మంది దివ్యాంగులకు ప్రతి నెల రూ.18 కోట్ల 66 లక్షల మొత్తాన్ని నేరుగా వారి ఇంటికే వెళ్లి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో దివ్యాంగుల సాధికారత కోసం ఇప్పటి వరకు 76 ల్యాప్‌టాప్‌లు, 65 టచ్ ఫోన్లు, 40 ట్రైసైకిళ్లు, 142 వీల్‌చైర్లు పంపిణీ చేయగా, త్వరలోనే మరో 70 మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు అందించనున్నట్లు తెలిపారు. అలాగే, దివ్యాంగులకు సంబంధించిన బ్యాక్‌లాగ్‌లో ఉన్న 17 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు, మిగిలిన విభాగాల్లో ఖాళీల వివరాలు సేకరించి మరో నోటిఫికేషన్ కూడా త్వరలో ఇవ్వనున్నట్లు చెప్పారు. వైజాగ్‌లో పని చేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభ, సంకల్పం ఎంతో గొప్పదని, సాధారణ వ్యక్తుల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నట్లు తాను ప్రత్యక్షంగా గమనించినట్లు కలెక్టర్ తెలిపారు. క్రీడా రంగంలో కూడా అనేక మంది దివ్యాంగులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. దివ్యాంగ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ అంగ వైకల్యం ఉన్న వారు అర్హులని, సదరం సర్టిఫికెట్, డిజేబిలిటీ గుర్తింపు కార్డు ఆధారంగా ఈ సౌకర్యం పొందవచ్చని చెప్పారు. అర్హత బట్టి వారి సహాయకులకు 50 శాతం రాయితీ కూడా ఉంటుందని పేర్కొన్నారు. గుర్తింపు కార్డు లేదా పాస్ లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 18 నుండి ఈ ఉచిత ప్రయాణ సదుపాయం అమలులోకి వచ్చినట్లు, డిజిటల్ పాస్‌లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణ సమయంలో తప్పనిసరిగా ఒరిజినల్ పాస్ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి ఐవీఆర్ఎస్ కాల్స్ నిర్వహిస్తున్నట్లు, బస్ స్టేషన్లలో త్రాగునీరు, శౌచాలయాలు, శానిటేషన్ వంటి సౌకర్యాల మెరుగుదల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.50 లక్షలు ఖర్చు చేయగా, మరిన్ని పనుల కోసం రూ.1.2 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్ లకు సరైన సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలో అక్షరాస్యత శాతం పెంపునకు "అక్షరాంధ్ర" కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున మహిళలకు విద్య అందిస్తున్నట్లు, జిల్లాలో 1,62,000 మందికి పరీక్షలు నిర్వహించగా 99.08 శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టి, ఆడపిల్లల విద్యపై దృష్టి సారించాలని, పాత ఆలోచనలను విడిచిపెట్టి వారికి ఉన్నత విద్య అందించాలని మరియు ప్రోత్సహించాలని సూచించారు. పండగ వాతావరణంలో దివ్యాంగులకు ఉచిత బస్సు సదుపాయం వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం× అని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళలకు అందించిన విధంగానే, దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు సదుపాయం అందించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. పేదల పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ ఉందని, సూపర్ సిక్స్ వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ పథకాలను నిరంతరం అమలు చేస్తుండటం కూటమి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఇటువంటి దూరదృష్టి కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , దేశంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లు అందజేసి వారికి సహాయపడిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో చంద్రబాబు నాయుడు ఉన్నంతవరకు రాష్ట్ర ప్రజలకు ఎటువంటి భయం అవసరం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పలు పరిశ్రమలు తీసుకువచ్చి, అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈరోజు దివ్యాంగులకు అందించిన ఈ సదుపాయం కూడా ఆ దిశలోనే ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో పేదరికం నిర్మూలననే ముఖ్యమంత్రి లక్ష్యమని తెలిపారు. కర్నూలు జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన తక్కువ కాలంలోనే ప్రధానమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ సభాముఖంగా అభినందించారు , ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ×విభిన్న ప్రతిభావంతులకు గౌరవం?సంక్షేమ పథకాలతో మెరుగైన జీవనం జిల్లా టి. డి.పి అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ ఈ సందర్భంగా గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ ఒకప్పుడు దివ్యాంగుల పరిస్థితి బాగుండేది కాదని , ప్రస్తుతం ప్రభుత్వం వారిని గౌరవంగా "విభిన్న ప్రతిభావంతులు"గా సంబోధిస్తూ వారి గౌరవాన్ని పెంచిందని తెలిపారు. సమాజంలో వారికి సమాన స్థానం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు దేవుడు ప్రత్యేకమైన ప్రతిభను ప్రసాదించాడని, ఆ ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వారి సంక్షేమానికి కట్టుబడి ఉంది, జీవనోపాధి, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనానికి అనువైన చర్యలు చేపడుతోందని వివరించారు. రాష్ట్రంలో సుమారు 11 లక్షల విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని పేర్కొంటూ, వారికి అందిస్తున్న పెన్షన్‌ను రూ.3000 నుండి రూ.6000కి పెంచడం ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అలాగే 40 శాతం దివ్యాంగత కలిగిన వారికి ఉచిత బస్సు సౌకర్యాన్ని "దివ్యాంగ శక్తి" పథకం ద్వారా అందించడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి చేపట్టిన "ఇంద్రధనస్సు" కార్యక్రమం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు వివిధ రంగాల్లో సహాయం అందిస్తూ, వారి సామర్థ్యాలను వెలికితీయడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని గుడిసె కృష్ణమ్మ తెలిపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ బస్ స్టాండ్ నుండి కలెక్టరేట్ వరకు బస్సులో ప్రయాణించి దివ్యాంగ శక్తి టికెట్లను అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బొందుల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింహ, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, కర్నూల్ డిపో మేనేజర్ సుధారాణి , ఎడి డిజేబుల్ ఫాతిమా రయీస్ , జాతీయ అంధుల సమాఖ్య అధ్యక్షులు పుష్ప రాజ్ , ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జేమ్స్, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు ఎల్లప్ప, జిల్లా విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ ఉద్యోగస్తుల అధ్యక్షులు కృష్ణుడు, బదిరుల సంఘం అధ్యక్షుడు సాదిక్ భాష , జనసేన జిల్లా అధ్యక్షులు హర్షత్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి,





ఎమ్మిగనూరు, మార్చి, 18 (శ్రీ చక్ర): దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మిగనూరు ఏపీఎస్ ఆర్టీసీ బస్ స్టాండ్‌లో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి. పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు సులభమైన ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతోందని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 40% కంటే ఎక్కువ వికలాంగత్వం కలిగిన పిడబ్ల్యుడి పాస్ హోల్డర్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా నడిచే పల్లెవెలుగు, అల్ట్రాటెక్, పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి వారితో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలు మరియు మద్దతు, పెన్షన్ల పెంపు వంటి పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, టిడిపి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్, దివ్యాంగులు, మండల మరియు పట్టణ కమిటీ సభ్యులు, నాయకులు, శారీరకంగా దివ్యాంగులు పాల్గొన్నారు.

# జాతీయ విలువద్య పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం - డాక్టర్. శంకర్ శర్మ




కర్నూలు స్పోర్ట్స్, మార్చి 18 (శ్రీచక్ర) : జాతీయ స్థాయి విలువద్య పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డాక్టర్. శంకర్ శర్మ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గుంటూరులో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జాతీయ స్థాయి విలువిద్య పోటీలు కొనసాగుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో కర్నూలుకు గుర్తింపు తీసుకుని రావాలని ఆయన క్రీడాకారులను సూచించారు. విద్యార్థులు విలువిద్యలో శిక్షణ తీసుకోవడం వల్ల వారికి ఏకాగ్రత, మనోధైర్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి భూపతి రావు, ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ నాగరత్నమయ్య, కోచ్ వంశీ కృష్ణ, భరత్, ఎన్. గునిత్ రెడ్డి, క్రీడాకారులు కే.అవంతిక, ఎస్. ఇశాంత్, అద్విత, బీ. ఆద్యా, వర్షిణి పాల్గొన్నారు.

# ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి

## డాక్టర్ కె. వి. సుబ్బారెడ్డి, ప్రముఖ విద్యాసంస్థల అధినేత పండుగల పరమార్థం తెలుసుకోవాలి..డాక్టర్ మోక్షేశ్వరుడు అలరించిన ఉగాది కవితాగానం

కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): శ్రీపరాభవనామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు తెలుగుకళ్ళం సాహితీ సమితి ఆధ్వర్యంలో కర్నూలు నగరం నందికొట్కూరు రోడ్డులోని శ్రీ వరసిద్ధి వినాయక వినాయక స్వామి కళ్యాణ మంటపం నందు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం అత్యంత కమనీయంగా సాగినది. తెలుగు కళ్ళం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మన జాతి జీవన విధానాన్ని ప్రతిబింబంపజేసే మన నూతన సంవత్సరం ఉగాదితో ప్రారంభమై, మన సంస్కృతి విలువల్ని మన సనాతన ధర్మాన్ని, కాపాడుకోవాలని అధ్యక్షులు తొలి పలుకులలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం స్వర్ణలత, వరసిద్ధి వినాయక స్వామి ఆలయ కమిటీ సభ్యులు జి.నాగయ్య, కమలాకర్, జయరాం రెడ్డి, కాంతారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, వేంకటరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు విశ్రాంత సబ్ ఇన్స్పెక్టర్ శేషయ్య, సామాజిక కార్యకర్త అంబటి శివశంకర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు కె.కృష్ణారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, కార్యక్రమం పర్యవేక్షకులు సి.హెచ్. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని ఉగాది పర్వదిన ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమానంతరం అతిథులకు దుశ్శాలువాలతో సన్మానించారు.



# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన లో కలెక్టర్, ఎస్ పి

తిరుపతి, మార్చి 18(శ్రీచక్ర): ఈనెల 20 మరియు 21వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కుటుంబసమేతంగా తిరుపతి,తిరుమల పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్,ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు ముందస్తుగా హెలిపాడ్ వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించారు.



# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## ‘దివ్యాంగ శక్తి’ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ దివ్యాంగుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది:జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్




నంద్యాల, మార్చి 18 (శ్రీచక్ర): దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఇంద్రధనుస్సు’ కార్యక్రమంలో భాగంగా ‘దివ్యాంగ శక్తి’ (ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం) పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. బుధవారం స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో “దివ్యంగ శక్తి” పథకాన్ని రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులు విద్య, ఉపాధి, మరియు ఆరోగ్య అవసరాల కోసం ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు అని, ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. ఏ ఒక్క పౌరుడు వివక్షకు గురికాకూడదనే లక్ష్యంతో, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పానికి ఈ కార్యక్రమమే నిదర్శనం అన్నారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల శ్రేయస్సు కోసం “దివ్యాంగ శక్తి” అనే పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా పిడబ్ల్యుడి చట్టంలోని 21 వైకల్యాలు ఉన్న దివ్యాంగులు సిటీ బస్సులు, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి కూడా టికెట్ ధర మొత్తంలో 50 శాతం మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రీమియం ఏసి, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే దివ్యాంగులకు కూడా 50% టికెట్ రుసుములో మినహాయించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మంత్రి ఫరూక్, జాయింట్ కలెక్టర్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు.

## పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆల్ మైనారిటీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణి కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పండుగను సంతోషంగా జరుపుకోలేని స్థితిలో ఉన్న సుమారు 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి లబ్ధిదారునికి ?600 విలువైన నిత్యావసర సరుకులు (బియ్యం, కిరాణా) మరియు పాలు, స్వీట్లు వంటి పండుగ ఖర్చుల కోసం ?400 నగదును కలిపి మొత్తం ?1000 విలువైన తోఫాను అందచేయడం జరిగిందన్నారు. పేదలను ఆదుకోవడం పుణ్య కార్యక్రమమని ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, జిల్లా ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ముక్తియార్ బాషా, జనరల్ సెక్రెటరీ రియాజ్ బాషా, వైస్ ప్రెసిడెంట్ జాకిర్ హుస్సేన్, ఫైనాన్స్ సెక్రటరీ షఫీ అహ్మద్, ఉమెన్ సెక్రెటరీ సహారా భాను, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జమిల్ ఉద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సఫియుల్లా బైగ్, అబ్దుల్ కాలిక్, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఉగాది , రంజాన్ పండుగల శుభాకాంక్షలు తెలిపిన ..ఎస్పీ విక్రాంత్ పాటిల్




కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా ప్రజలకు ఉగాది , రంజాన్ పండుగల శుభాకాంక్షలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ“ శ్రీ పరాభవ నామ” ఉగాది తెలుగు ప్రజల నూతన సంవత్సర ఆరంభాన్ని సూచించే శుభపర్వదినమని పేర్కొన్నారు. రంజాన్ పండుగ పరస్పర స్నేహభావం, సహానానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కర్నూలు జిల్లా ఎల్లప్పుడూ మత సామరస్యానికి ప్రతీక గా ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ పండుగలను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ మరోసారి జిల్లా ప్రజలకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుభాకాంక్షలు తెలియజేశారు

## జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి టీజీ భరత్




కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టి.జి. భరత్ జిల్లా ప్రజలకు ఉగాది,రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంత్రి రాష్ట్ర మరియు జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.. ప్రజలకు అన్నీ శుభాలు కలగాలని, విజయాలు సిద్ధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, అన్ని వర్గాల ప్రజలూ ఆనందంగా ఉండాలన్నారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని మంత్రి ఆకాంక్షించారు. మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ పండుగ అని, సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని, ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరుల కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరుల కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని, ముస్లిం సోదర, సోదరమణులందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని మంత్రి పేర్కొన్నారు.

## కర్నూలు నగర పాలక సంస్థ కార్పొరేటర్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా కార్పొరేటర్ల ను సన్మానించిన కాటసాని దంపతులు

కల్లూరు, మార్చి 18 (శ్రీచక్ర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ, సుపరిపాలన అందించిన కర్నూలు నగర పాలక సంస్థ కార్పొరేషన్ కార్పొరేటర్లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అభినందించారు. నిన్నటితో కర్నూలు నగర పాలక సంస్థ కార్పొరేషన్ మేయర్ తోపాటు కార్పొరేటర్లకు పదవి కాలం ముగియడంతో మంగళవారం తన గృహంలో వారికి శాలువ కప్పి సన్మానించిన కాటసాని రామభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ కూటమి ప్రభుత్వం ఒత్తిడిలకు లొంగకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనీ అంటుకొని ప్రజలకు అందించాల్సిన సేవలను అందించారని కాటసాని రామభూపాల్ రెడ్డి తెలిపారు. పదవులతో పనిలేకుండా ఎప్పటిలాగే పార్టీ బలోపేతానికి మరియు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని కాటసాని రామభూపాల్ రెడ్డి సూచించారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని దక్కించేందుకు అనేక ప్రయత్నాలు చేసిన పార్టీ కోసం కార్పొరేటర్లు ఐక్యతతో కూటమి కుట్రలను తిప్పి కొట్టారని కార్పొరేటర్లను అభినందించారు.వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలతో ప్రతి ఒక్క కార్పొరేటర్ రానున్న ఎన్నికల్లో మరింత పనిచేయాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తెలిపారు.

## జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జిల్లా ప్రజలకు తెలుగు నూతన సంవత్సరాది ఉగాది మరియు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ ఉగాది ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, అన్ని వర్గాల ప్రజలూ ఆనందంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్టగా, అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం గడిపిన ముస్లిం సోదర సోదరీమణులందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు..క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని, దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరింప చేసిన రంజాన్ పండుగను ముస్లిం సోదర సోదరీమణులందరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని కలెక్టర్ కాంక్షించారు.

## రాయలసీమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్షిప్, పేద కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ





కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): రాయలసీమ ప్రాంతంలో సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుందని రాయలసీమ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సయ్యద్ షా ఫహద్ తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని ఉస్మానియా కాలేజీ రోడ్ లో ఎంఎస్ ఫంక్షన్ హాల్ లో రాయలసీమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్షిప్, పేద కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ షా ఫహద్ మాట్లాడుతూ “సర్వజన సుఖినోభవంతు” అనే నినాదంతో 2016లో ప్రారంభమైన రాయలసీమ ఫౌండేషన్ కులమతాలకు అతీతంగా పేద, అర్హులైన వారికి సేవలందిస్తోందన్నారు. ప్రస్తుతం 2026 సంవత్సరంలో ఈ సంస్థ పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని ఆయన చెప్పారు. మెరిట్ ఉన్న 50 మంది విద్యార్థులకు వారి ప్రతిభను బట్టి రూ.5 వేల నుంచి రూ. 10 వేల వరకు స్కాలర్షిప్‌లను అందిస్తున్నారు. అలాగే సుమారు 350 పేద కుటుంబాలకు ఒక్కొక్కటి రూ.2 వేల విలువైన రేషన్ కిట్లను పంపిణీ చేశామన్నారు. 2016లో కేవలం 30 కుటుంబాలతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమాలువి ప్రస్తుతం 600 పైగా కుటుంబాలకు విస్తరించడం సంస్థ నిర్వహణలో సయ్యద్ షా ఫహద్ తో పాటు నిరంజన్, సురేష్ పుట్టంగంట, శ్రీనివాసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. భవిష్యత్తులో కర్నూలుతోపాటు మొత్తం రాయలసీమ అభివృద్ధి కోసం మరిన్ని విద్యా, ఆరోగ్య, ఉపాధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే బీవీ,




ఎమ్మిగనూరు, మార్చి, 18 (శ్రీ చక్ర): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమల తీరుతో పాటు పాఠశాల కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశమై మధ్నాహ్న భోజనం పథకం అమలు విధానంపై,ఎదురవుతున్న సమస్యలు మరియు నిర్వహణలో ఉన్న సవాళ్లపై చర్చించారు. తన అభిప్రాయాలను ఫీడ్‌బ్యాక్ రూపంలో నమోదు చేసి సంబంధిత ఆయా శాఖల అధికారులకు సూచనలను తెలియజేశారు.విద్యార్థులకు పోషకాహారం మరియు విద్యా అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్ ఆదేశాలకనుగుణంగా ఈ తనిఖీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి విలేకరులకు తెలిపారు.



## ప్రత్యేక అధికారిగా బాధ్యతల స్వీకరణ

కర్నూలు, మార్చి 18 (శ్రీచక్ర): నందికొట్కూరు పురపాలక సంఘానికి ప్రత్యేక అధికారిగా కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం కర్నూలులోని క్యాంపు కార్యాలయంలో సి.ఆర్ దస్త్రంలో ఆయన సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ.. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ జె.వెంకటరమణ రెడ్డి, ఏఈ దినేష్ పట్టణ స్థితిగతులను వివరించి, కొనసాగుతున్న పనులపై నివేదిక సమర్పించారు.పట్టణ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలి.

**167-తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎన్.మౌర్య**



తిరుపతి, మార్చి 18(శ్రీచక్ర):నియోజకవర్గ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 ప్రక్రియకు గాను అన్నీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూతు లెవెల్ ఎజెంట్లను నియమించి సదరు జాబితా ను ఆఫీసుకు ఈ వారం లోపు సమర్పించాలని ఆధేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. 2025 జాబితాలోని ఓటర్లను 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ చేయు నిమిత్తం అందరూ బూత్ లెవెల్ అధికారులు, సూపెర్వైజర్స్,గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి మ్యాపింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా నేడు గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

కోట : మార్చి 18 (శ్రీ చక్ర):కోట పట్టణంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం. సునీల్ కుమార్ చేతుల మీదగా గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కార్యక్రమం జరుగుతుందని గ్రీన్ ఫౌండేషన్ సభ్యులు షేక్.నౌషాద్ బాషా తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జరిగే ఈ కార్యక్రమంలోకోట,వాకాడు,చిట్టమూరు మండలాలకు చెందిన 600 కుటుంబాలకు రంజాన్ తోఫా కోట పట్టణంలోని కోటమ్మ గుడి బైపాస్ రోడ్డులో ఎస్ కే బి ఆవరణలో భారీ సేవా కార్యక్రమం నిర్వహించబడుతుందని,రంజాన్ తోఫా మూడు మండలాల పేద ముస్లింలందరూ పాల్గొనాలని తెలియజేశారు.అదేవిధంగా తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షులు జలీల్ అహ్మద్ సహకారంతో ప్రతి సంవత్సరం జరుగుతున్న రంజాన్ తోఫా మానవత్వమే ఊపిరిగా మంచితనమే ప్రాణంగా పేద ప్రజలే మార్గంగా నిరంతరం సేవా మార్గంలో గ్రీన్ ఫౌండేషన్ పయనిస్తుందని ఆయన అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా సేవలో ప్రజల పక్షాన గ్రీన్ ఫౌండేషన్ అండగా నిలిచిందని,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మా ప్రియతమ నాయకులు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం.సునీల్ కుమార్ వస్తున్నారని ఆయన చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

## దేశంలో ఎక్కడా లేనివిధంగా 'దివ్యాంగ శక్తి' పథకం..., తాహాసిల్దార్ కటారి.జయ జయ రావ్వ చేతుల మీదుగా దివ్యాంగుల బస్సు ప్రారంభం..,




కోట : మార్చి 18 (శ్రీ చక్ర): దేశం,రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఏపీ వ్యాప్తంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని కోట తహసీల్దార్ కటారి.జయ జయ రావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కోట ఆర్టీసీ డిపో వద్ద దివ్యాంగ శక్తి బస్సు ప్రయాణ పథకం ప్రారంభించారు.కోటలోని దివ్యాంగులు ఐక్యంగా తాహాసిల్దార్ ను శాలువాలు, పూలమాలతో సత్కరించి ఆహ్వానం పలికారు.అనంతరం కోట తాహాసిల్దార్ కే.జయ జయ రావు,వాకాడు ఆర్టీసీ డిఎం చిన్న పెంచలయ్య లు రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి వారి చేతుల మీదగా దివ్యాంగుల కోసం నూతనంగా బస్సును ప్రారంభించడం జరిగింది.తహసీల్దార్ తో పాటు దివ్యాంగులు,ఆర్టీసీ సిబ్బంది కలిసి బస్సులో బస్టాండ్ చుట్టూ ప్రయాణించారు.అనంతరం తాహాసిల్దార్ కె.జయ జయ రావు మాట్లాడుతూ కోట మండలంలోని దివ్యాంగులు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం చిన్న పెంచలయ్య ఆర్టీసీ అధికారులు రఘురామయ్య,వీఆర్వో ఏడుకొండలు,ఆర్టీసీ సిబ్బంది,పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో..., నిరుపేదలకు కుట్టు మిషన్ అందజేత...,

కోట : మార్చి 18 (శ్రీ చక్ర):కోట మండలం శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లూరుకి చెందిన దువ్వూరు.నగేష్ రెడ్డి దాత్రుత్వంతో 11 వేల రూపాయలు విలువచేసే కుట్టుమిషన్ ను నెల్లూరు హరినాధపురంలో నివాసముంటున్న వల్లుమూడి. నిర్మలమ్మ నిరుపేదరాలు.అయితే ఆమెకు వికలాంగురాలైన కుమార్తె ఉంది.ఈ నిర్మలమ్మ కుట్టు మిషన్ నేర్చుకుని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి వారిని సంప్రదించి తన ధీన స్థితిని వివరించడం జరిగింది. దీంతో స్పందించి దాత దువ్వూరు. నగేష్ రెడ్డి కి విషయం చెప్పగా ఆమెకు 11వేల రూపాయలు విలువచేసే కుట్టు మిషన్ అందజేసినట్లు శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం. రమణయ్య తెలిపారు.దీంతో నిరు పేదరాలు నిర్మలమ్మ దువ్వూరు. నగేష్ రెడ్డి,అల్లం.రమణయ్య లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# దివ్యాంగులకు ఉచిత బస్సు ఘనత చంద్రన్న ప్రభుత్వానిదే. ప్రజల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాలెం మార్చ్ 18(శ్రీ చక్ర) ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ఎమ్మెల్యే,నాగలాపురం లో ప్రత్యేక అవసరాల వ్యక్తులకు అన్నదానంప్రత్యేక అవసరాల వ్యక్తులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యవేడు లో నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల వ్యక్తులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయడంతో పాటు వారిని దగ్గరుండి సత్యవేడు - తిరుపతి బస్సులో ఎక్కించి జెండా ఊపి ప్రారంభించిన పిమ్మట వారితో కలిసి ఎమ్మెల్యే ప్రయాణించారు. మార్గ మధ్యంలో నాగలాపురం లో బస్సు ఆపి మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గరుండి విద్యాంగులకు భోజనం వడ్డించారు. అక్కడ నుండి విద్యాంగుల ఉచిత బస్సును తిరుపతి కి సాగనంపారు.ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై దివ్యాంగులు ఆర్టీసీ బస్సుల్లో తమ పాస్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఇంతటి మహత్తర కార్యక్రమానికి





శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. చెల్లయ్య కుటుంబానికి ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శనాగలాపురం కు చెందిన చెల్లయ్య మరణించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం మధ్యాహ్నం పరామర్శించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అధికారుల బాధ్యత ఒత్తిడికి లొంగకూడదు

**సంతకం పెట్టే ముందు ఆలోచించండి**

**అధికారులకు డీవీఎంసీ గుత్తి త్యాగరాజు విజ్ఞప్తి**



వరదయ్యపాలెం,మార్చి18(శ్రీచక్ర):ప్రభుత్వ వ్యవస్థలో అధికారులు కీలక పాత్ర పోషిస్తారు.వారి ప్రతి సంతకం, ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని తిరుపతి జిల్లా, వరదయ్యపాలెంకు చెందిన డీవీఎంసీ మెంబెర్, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ప్రెసిడెంట్ గుత్తి త్యాగరాజు అన్నారు. ఇలాంటి బాధ్యత గల స్థానాల్లో ఉన్నవారు రాజకీయ ఒత్తిడులకు లోనైతే, అది కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా పరిపాలనా వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.ఇటీవల ఒక మండల స్థాయి అధికారి, ఒక రాజకీయ నాయకుడి సూచనలను అనుసరించి తీసుకున్న నిర్ణయం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఘటన చర్చనీయాంశంగా మారింది.ఈ సంఘటన మరోసారి ఒక ముఖ్యమైన నిజాన్ని గుర్తు చేస్తోంది. అధికారిక విధుల్లో తీసుకునే ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.రాజకీయ నాయకులు మారుతారు, పరిస్థితులు మారుతాయి. కానీఅధికారులసంతకాలు మాత్రం రికార్డుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని త్యాగరాజుఅన్నారు.కాబట్టి తాత్కాలిక ఒత్తిళ్లు లేదా వాగ్దానాల కోసం తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు,భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారి తీసే అవకాశముంది."చేతులుకాలాక ఆకులు పట్టుకోవడం" వంటి పరిస్థితులు ఏర్పడకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే ? అధికారులకు ఉన్న నిజమైన రక్షణ చట్టం,నియమాలు మాత్రమే. వ్యక్తులు కాదు. కాబట్టి, ప్రతి ఫైల్‌ను పరిశీలించే సమయంలో పారదర్శకత, నిబద్ధత, మరియు బాధ్యతతో వ్యవహరించడం అత్యంత అవసరం.ఈ నేపథ్యంలో, అధికారులకు ఒక స్పష్టమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉంది: ఒత్తిడికి లోనవద్దు. నిబంధనలు పాటించండి. మీ నిర్ణయాలకు మీరు బాధ్యత వహించండి.ప్రభుత్వ వ్యవస్థ బలంగా ఉండాలంటే, అధికారులు ధైర్యంగా, న్యాయంగా, మరియు నిష్పాక్షికంగా పనిచేయాలి.అదే మంచి పరిపాలనకుమూలం త్యాగరాజు అన్నారు.

## కార్మికుడు ఎలక్ట్రిషన్ పై ఆర్ డబ్ల్యూ ఎస్ డిఇ శ్రీనివాస్ ఆగ్రహం

**స్థానికుల జోక్యంతో కంగు తిన్న డిఇ.కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించాలి ఎట్టకేలకు కార్మికులకు జీతాలు విడుదల.**





కాజులూరు, మార్చి 18 (శ్రీచక్ర)గొల్లపాలెం రక్షిత మంచినీటి పథకంలో ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్న సత్య వీర వెంకట నాగేశ్వరరావు (కన్నా) పై ఆర్డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాసు తన స్థాయిని మరిచి ఆగ్రహంతో తన ప్రతాపాన్ని చూపించారు. దీంతో అక్కడకు చేరుకున్న స్థానికులు జోక్యం చేసుకుని నిలదీయడంతో తన తప్పును తెలుసుకుని కంగుతిన్నారు.ఈ మేరకు బుధవారం గొల్లపాలెంలో రక్షిత మంచినీటి పథకం వద్దకు ఆర్డబ్ల్యూఎస్ డి ఈ శ్రీనివాస్, జెఇ పద్మరూప , కాంట్రాక్టర్ కన్నబాబు విచ్చేసారు.దీంతో డిఇ శ్రీనివాసు జీతాలు విషయంలో సామరస్యంగా పరిష్కరించుకోవాల్సన నీవు పత్రికల్లో కెక్కి పరువుతీసావు అని ఎలక్ట్రిషన్ కన్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆమాట మాట పెరిగి దూషించడంతో అక్కడ ఉన్న స్థానికులు జోక్యం చేసుకుని డిఇ శ్రీనివాసు ప్రవర్తించిన తీరుపై ఘటూగా స్పందించడంతో ఆయన ఒక్క సారిగా షాక్ గురై మౌనం వహించారు.ఇక్కడ పనిచేస్తున్న 11 మంది వర్కర్లలో ఒక వ్యక్తి ఏళ్ళతరబడి అధికారులకు సన్నిహితంగా ఉంటూ ఆర్డబ్ల్యూఎస్ పనుల్లో తన సత్తా చాటుకుంటున్నారని విమర్శించి డిఇ శ్రీనివాస్ వద్ద బాహాటంగా చెప్పటం జరిగింది.అయితే అధికారులు, కాంట్రాక్టర్, స్థానికులు వాదోపవాదాలు నడుమ ఎట్టకేలకు సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు సంకల్పించి అధికారుల సమక్షంలో ఎలక్ట్రిషన్ కన్నా గతంలో తనకు 17500 రూపాయలు నెలకు ఇచ్చేవారని అదేవిధంగా ఇవ్వాలనే పట్టు పట్టుపట్టడంతో ఎట్టకేలకు 17వేల500రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించారు. అలాగే ఐదు నెలల జీతాలు బకాయిలు గాను రెండు నెలలు తక్షణం ఇచ్చేందుకు కూడా అంగీకరించడంతో సమస్య ఎట్టకేలకు సామరస్యంగా పరిష్కారం అయింది. అయితే తనకు రావాల్సిన జీతం తన బ్యాంక్ అకౌంట్ వేయాలని కన్నా కోరడంతో కన్నాకు తప్ప మిగిలిన వారందరికీ క్యాష్ రూపంలో అందజేసినట్లు కాంట్రాక్టర్ కన్నబాబు సందర్భంగా తెలియజేశారు.కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించాలి. రాత్రి, పగలు తేడాలేకుండా పనిచేస్తున్న ఇక్కడ కార్మికులకు ఇన్సూరెన్స్ చేయలేదని వారికి తక్షణం ఇన్సూరెన్స్ చేయించాలని డిఇ శ్రీనివాస్ నికోరారు. దీంతో స్పందించిన డిఇ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎక్కడా కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించలేదని విషయం ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టి ఇన్సూరెన్స్ చేయించే చర్యలు చేపడతామని డిఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే మండల పరిధిలో త్రాగునీటి సరఫరా విషయంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని కొన్ని చోట్ల అయితే త్రాగునీరు అందడం లేదని డిఇ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో అంగర కృష్ణ,అంగర చిన్న,వంకల ఏసు, పోతుల వీరబాబు,అయినాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు



## శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద రోడ్డు ప్రమాదం.. వైసీపీ నాయకుడు సర్దార్ భాయ్ మృతి



శ్రీ సిటీ మార్చ్ 18(శ్రీ చక్ర) తడ: శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదంచోటుచేసుకుంది. ఆరంభాకం నుండి బైక్ పై తడకి వస్తున్న సమయంలో శ్రీసిటీ పరిశ్రమ బస్సు వెనక నుంచి బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తడ వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో తడ వైసీపీ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. సర్దార్ ఆకస్మిక మృతిపై పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నారు.

## కోలంక సొసైటి నందు పామాయిల్ సాగుపై అవగాహన



కాజులూరు, మార్చి 18( శ్రీచక్ర)రైతులకు లాభసాటి గల పామాయిల్ సాగుపై దృష్టి సారించిచలని కోలంక సొసైటి అధ్యక్షులు బొండా వెంకట నరసింహనాయుడు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఉద్యాన శేఖ ఆధ్వర్యంలో పామ్ ఆయిల్ సాగు ప్రోత్సాహనికి రైతుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం,కోలంక పరిధిలో అవగాహన సదస్సు నిర్వహించిడం జరిగింది.ఈ కార్యక్రమం కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు అధ్యక్షతన ఉద్యాన అధికారి కె. శైలజ అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వేసాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్వైజర్ పి. శ్రీనివాస్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసన్న, రైతులు దాట్ల వీర వెంకట సత్యనారాయణ రాజు, తొగరు వీరబాబు, పోలిశెట్టి గోవింద్, నామా కుమార్ స్వామి, బూరెల శ్రీను తదితరులు పాల్గొన్నారు

## అన్నదాన సుఖీభవ పథకంపై ఇంటింటికీ ప్రచారం



కాజులూరు, మార్చి 18( శ్రీచక్ర)భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లో సారథ్యంలో ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకాలు గురించి రైతులకు జరుగు లబ్ధి పై ఇంటింటికీ వెళ్ళి వివరించే కార్యక్రమం కోలంక గ్రామంలో నిర్వహించారు.ఈమేరకు కాజులూరు మండలం కోలంక గ్రామంలో పలువురు రైతులతో మండలవ్యవశాఖ అదికారులతో ఇంటింటికీ వెళ్ళి రైతులకు వివరించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు కోలంక గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, డీసీ దాట్ల విజయ గోపాల్ రాజు, అగ్రికల్చర్ ఎ.వో అశోక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసన్న ,తెలుగుదేశం నాయకులు దాట్ల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా పేదలకు నిత్యవసర సరుకులు దుస్తులు పంపిణీ చేసినసేవే శ్వాసగా. మాస్టర్ ఫౌండేషన్ అధినేత సయ్యద్ గౌస్ మొహిద్దిన్



మార్కాపురం మార్చి 18 ( శ్రీ చ(క)మార్కాపురం సేవే శ్వాసగా.. మాస్టర్ ఫౌండేషన్.ముందడుగు నిరు .పేదలకు నిత్యవసర వస్తువులు..దుస్తుల పంపిణీ చేసిన వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్.సేవే శ్వాసగా మాస్టర్ ఫౌండేషన్ ముందడుగు వేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి, వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ తెలిపారు. ప్రతి ఏడాది రంజాన్ సందర్భంగా నిరుపేదలకు.కుల.మతాలకతీతంగా నిత్యవసర వస్తువులు దుస్తుల పంపిణీ చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో నిరుపేద ముస్లింలకు ఇతర మత లోని పేదలకు నిత్య వన వస్తువులు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో మార్కాపురం పట్టణంలో కొంతమంది పేద మహిళలకు గుర్తించి వారికి కుట్టు మిషన్ లో శిక్షణ ఇప్పించి వారు ఆర్థికంగా నిలబడెందుకు కుట్టు మిషను ఉచితంగా పంపిణ్ణీ చేసి వారి జీవనోపాడికి ఆసరాగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమాలను తమ మాస్టర్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగిస్తుంటామని తమ ఊపిరి ఉన్నంతవరకు ఈ కార్యక్రమాలు.కొనసాగుతుంటాయని ఆయన తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా అల్లాహ్ తో వైసీపీ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, వైయస్ జగన్ మరోసారి సీఎం అయితేనే రాష్ట్రంలోని పేదల భవిష్యత్తు బాగుపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మళ్లీ రావాలి జగన్ కావాలి వైసిపి పాలన.అని.ప్రజలు .కోరుకుంటున్నారని ఆయన వెల్లడించాడు. ప్రతి వైసీపీ కార్యకర్త మరింత కష్టపడి వైసిపి అధికారంలోకి వచ్చేలా వైయస్ జగన్ మరోమారు సీఎం అయ్యేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చాడు.


## నవోదయ లో సీటు సాధించిన వివేకానంద విద్యాపీఠం విద్యార్థిని




మార్కాపురం మార్చి 18 (శ్రీ చ(క)మార్కాపురం,: శ్రీ వివేకానంద విద్యాపీఠం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పి. పద్మావతి ప్రతిష్టాత్మక జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో (6వ తరగతి ప్రవేశాల కోసం) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించినట్లు పాఠశాల సెక్రటరీ యెలూగూరి వెంకట ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపింది.ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పేరం సత్యనారాయణ, సెక్రటరీ యెలుగూరి వెంకట ప్రసాద్ , ట్రెజరర్ మేడా వెంకట ప్రసాద్ మరియు హెడ్ మాస్టర్ రావిక్రింది మల్లిఖార్జున మాట్లాడుతూ.తమ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో అందించడం వలనే విద్యార్థులు ఇలాంటి అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఎంతో పోటీ ఉండే నవోదయ ప్రవేశ పరీక్షలో పద్మావతి సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణమని, ఈ విజయం ఇతర విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని వారు అన్నారు. కృషి పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు వెళ్ళవచ్చు అని అన్నారు.నవోదయలో సీటు సాధించిన చిరుతల్లి పద్మావతిని, ఆమెకు నిరంతరం ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులను మరియు విద్యార్థినికి ప్రత్యేక తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి, ప్రత్యేక అభినందనలు తెలియజేసింది. విద్యార్థిని భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి, పాఠశాలకు మరి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## తెలుగు ప్రజలకు ఉగాది. శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి

మార్కాపురం మార్చి 18 (శ్రీ చ(క)మార్కాపురంఅమరావతి:×తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు, పార్టీ నేతలకు, కార్యకర్తలకు మరియు హిందూ బంధువులందరికీ శ్రీ. పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త విజయాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని వివిధ అనుభవాలకు ప్రతీకలని, ఆనందం, దుఃఖం, కోపం, భయం, ఆశ్చర్యం, విరక్తి అన్నీ సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని ఈ పండుగ మనకు గుర్తు చేస్తుందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలనకోరుకుంటూ, సమాజంలో సౌహార్దం, శాంతి నెలకొనాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ రామచంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



## క్రమశిక్షణ,అంకితభావంతో ముందుకు సాగాలి

### ఘనంగా ఇందిరా కళాశాలలో యాన్యువల్ డేఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు





మార్కాపురం మార్చి 18 (. శ్రీ చ(క)మార్కాపురం ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం యాన్యువల్ డే వేడుకలు ఘనంగానిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి..కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విహెచ్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమాన్ రెడ్డి , మార్కాపురం డిప్యూటీ డిఇఓ శ్రీనివాసరావు, మార్కాపురం డిస్టిక్ మలేరియా ఆఫీసర్ డాక్టర్. రాహుల్ , విహెచ్ఆర్ విద్యా సంస్థల సెక్రెటరీ వెన్నా ఇందిరా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలన్నారు.క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలన్నారు.విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు అవసరమైనచర్యలుతీసుకుంటున్నామన్నారు.విద్యార్థులు స్నేహ పూర్వక వాతావరణంలో మెలగాలన్నారు. ఏ బ్రాంచిలో చేరినా మనసుపెట్టి చదివితే సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.అనంతరం మూడు రోజులుగా జరిగిన ప్రజ్ఞ 2 కే26 ఉత్సవం లో సాంకేతిక, సంస్కృతిక, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.సుబ్బన్న అకాడమిక్ డీన్ డాక్టర్. చంద్రలేఖ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విజయ, ఫార్మసీ కళాశాల ఇన్చార్జి రజిని డిప్లమా ఇన్చార్జి మాధవి, వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాప్ లో వైసీపీ పడిందా

కాకినాడ, మార్చి 18, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల జరిగిన రెండు భారీ మానవ తప్పిదాలు రాష్ట్రాన్ని కుదిపేశాయి. వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో 28 మంది, రాజమండ్రి కల్తీ పాలు సేవించి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 42 కుటుంబాల్లో తీరని వేదన మిగిల్చిన ఈ ఘటనలు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వైసీపీ ఈ ఘటనల పట్ల స్పందించిన తీరు, పార్టీ అగ్ర నాయకత్వం వహించిన మౌనం ఇప్పుడు ఆ పార్టీలోనే అంతర్గత మథనానికి కారణమవుతోంది.వేట్లపాలెంలో బాణసంచా తయారీలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల 28 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరోవైపు, రాజమండ్రిలో కల్తీ పాల సరఫరా కారణంగా మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ 14కు చేరింది. ఈ ఘోరాలు జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఇంతటి భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగినప్పుడు, ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ దూకుడుగా వ్యవహరించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో బాధితులకు భరోసా ఇవ్వడంలో పార్టీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి బాధితులను పరామర్శించి ఉంటే బాగుండేదని పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి. గతంలో పిఠాపురంలో ఇలాంటి ప్రమాదం జరిగినప్పుడు జగన్ స్వయంగా వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మరి ఇప్పుడు అంతకంటే పెద్ద ప్రమాదం జరిగినా ఎందుకు స్పందించలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.అయతే ఈ ఘటనలపై జగన్ కు సరైన సమాచారం లేదని కొంమంది చెప్తున్నారు. తాము జరిగిన విషయాన్ని ఎప్పటికప్పుడు పార్టీ పెద్దలకు వివరించామని, నిర్ణయం తీసుకోవాల్సింది పైస్థాయి నాయకత్వమేనని జిల్లా నేతలు వాదిస్తున్నారు.

## నూతన నోటరి న్యాయవాదిగా మొగల్ అన్వర్ బేగ్ నియామకం



మార్కాపురం మార్చి 18 (శ్రీ చ(క) మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మొగల్ అన్వర్ బేగ్ గారినీ నోటరీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేర కు రెవిన్యూ (రిజిస్ట్రేషన్-ఎఎ) శాఖ జీవో జారీ చేసింద దింతో మార్కాపు రం ప్రాంత ప్రజలకు ఇకపై నోటరీ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, డాక్యుమెంట్ అటెస్టేషన్ వంటి సేవలకు ఆయన అధికారికంగా ధ్రువీకరించనన్నారు. కావున నోటరీ అవసరమైన ప్రజలు కోర్ట్ సెంటర్ వద్ద ఉన్న మొగల్ గెస్ట్ హౌస్ పక్కన ఆయన ఆఫీస్ ను సంప్రదించాలని కోరారు.

## జనసేన నాయకులు పృథ్వీరాజ్ వారి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ



మార్కాపురం మార్చి 18 (శ్రీ చ(క)మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామంలో శ్రీ వేణుతల కాటంరాజు స్వామి తిరుణాల మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజు గారి ఆదేశాల మేరకు, జనసేన నాయకులు పాకనాటి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సుంకేసుల గ్రామంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎండల దృష్ట్యా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన జాయింట్ సెక్రెటరీ చిన్న పాల్, గ్రామ నాయకులు ఆవుల శ్రీరామ్, కౌలురి నాగేశ్వరావు, కౌలురి సహదేవుడు, బొల్లావారం మళ్ళీ, తంగారపు నాగార్జున తదితర జనసేనకులుపాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం జనసేన పార్టీ చేసిన.ఈ.కృషితోపాటునియోజకవర్గ ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏలూరు ఎంపీ ఇరికించారా... ఇరుక్కున్నారా..

ఏలూరు మార్చి 18, ?హైదరాబాద్ మెయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్ కేసులో సంచలన వాస్తవాలు బయటికొస్తున్నాయి.. ఒక సాధారణ డిన్నర్ పార్టీ అని వెళ్ళిన ఏలూరు ఎంపీ తెలియకుండానే డ్రగ్ కేసులో ఇరుక్కుపోయారు. దీని వెనుక తీవ్రమైన కుట్ర కోణం ఉందనే వాదన తెరపైకి వచ్చింది. కనీసం సిగరెట్ కూడా తాగే అలవాటు కూడా లేని పుట్టా మహేష్ కుమార్ పై డ్రగ్స్ ఆరోపణలు రావడంతో అయన సన్నిహితులు, పార్టీ నేతలు విస్తుపోయారు. . ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉన్న ఎంపీ మార్గమధ్యంలో ఫార్మ్ హౌస్ లో ఉన్న ఒక స్నేహితుడిని కలిసేందుకు ఆగారు. ఎంపీ ఫామ్ హౌస్ కి వెళ్ళిన కొద్దిసేపటికి ఈగల్ టీమ్ పోలీసులు వచ్చి డ్రగ్స్ చెకింగ్ చేయాలని చెప్పి అక్కడ ఉన్న 11 మంది వద్ద పోలీసుల సమక్షంలోనే యూరిన్ శాంపిల్ తీసుకుని రాపిడ్ టెస్ట్ చేసారు. 10 నిమిషాల తర్వాత చేవెళ్ల డీసీపీ వచ్చి ఐదుగురికి పాజిటివ్ వచ్చిందని, పుట్టా మహేష్ కుమార్ సహా మిగిలినవారికి నెగెటివ్ వచ్చిందని స్పష్టంగా ప్రకటించిన విషయం అన్ని మీడియాలలో రావడం ప్రజలంతా దానిని చూడటం అందరికి తెలిసిన విషయమే. చేవెళ్ల డీసీపీ ఏలూరు ఎంపీ వద్దకు వచ్చి మీకు నెగటివ్ వచ్చింది, మీరు కొద్దిసేపటిలో మిమ్మలిని పంపించేస్తామని కూడా చెప్పినట్లు సమాచారం. అసలైన ట్విస్ట్ ఇక్కడే మొదలయింది. ఇంతలో ఎస్పీ గిరిధర్ రంగప్రవేశం చేసారు. పుట్టా మహేష్ కు యూరిన్ టెస్ట్ లో నెగటివ్ వచ్చిన రిపోర్ట్ ను పోలీసులు ఎస్పీ ముందుంచారు. రిపోర్ట్ ను చూసిన ఎస్పీ అక్కడనుంచే ఎవరితోనో ఫోన్ లో మాట్లాడారు. మాట్లాడుతూ తలసాని శ్రీనివాస్ గారి అల్లుడు ఉన్నాడని ఫోన్ లోనే అవుతలి వ్యక్తులకు చెప్పారని తెలుస్తోంది . ఈ మాటలు అక్కడ అందరు వింటూనే ఉన్నట్లు కూడా సమాచారం . ఆ మాటలు వింటూనే ఉన్న ఎంపీ పుట్టా మహేష్.. నేను తలసాని అల్లుడిని కాదని తెలపటానికి ప్రయత్నించినట్టు తెలిసింది. కానీ ఎస్పీ ఆ మాటలు ఏవి పట్టించుకోకుండా ఫోన్ పెట్టేసిన తర్వాత మరొక ఫోన్ కూడా మాట్లాడారు. అనంతరం పోలీసులవేపు తిరిగి, యూరిన్ టెస్ట్ కచ్చితమైన రిజల్ట్ రాదు, బ్లడ్ టెస్ట్ కూడా చేస్తేనే కచ్చితమైన రిజల్ట్ వస్తుందని చెప్పి, నెగటివ్ వచ్చిన వాళ్ళతో సహ వీరందరిని ఇక్కడే ఉంచండి, బ్లడ్ శాంపిల్స్ కోసం పంపించాలని చెప్పి పక్కకు వెళ్లిపోయారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున 3 గంటల సమయంలో 11
మందిని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.ఇక్కడే అసలైన మాయ జరిగింది. తీసుకెళ్లింది బ్లడ్ సాంపిల్స్ కోసం.. కానీ అక్కడ తీసుకుంది మళ్ళి యూరిన్ శాంపిల్స్ మాత్రమే. ఇక్కడ కూడా 10 మంది యూరిన్ సాంపిల్స్ ఒక వైపుగా తీసుకెళ్లారు. కానీ ఎంపీ పుట్టా మహేష్ యూరిన్ శాంపిల్ మరోవైపు పంపినట్లు సమాచారం. అనంతరం ఈ 11 మందిని శంషాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. రెండవ సారి యూరిన్ సాంపిల్స్ తీసుకున్న సుమారు 5 గంటల తర్వాత, అంటే సుమారు ఉదయం 9 గంటల సమయంలోఈగల్ ఎస్పీ మీడియా ముందుకు వచ్చి, బ్లడ్ శాంపిల్స్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పాజిటివ్ వచ్చిందని
ప్రత్యేకంగా ప్రకటించారు. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే మొదటిసారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ ను 10 నిమిషాల్లో బయటికి చెప్పగా రెండవ సారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ 5 గంటల తర్వాత బయట పెట్టడం. ఇక్కడే ఖచ్చితంగా కుట్ర కోణం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఇక్కడ అసలైన, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బ్లడ్ శాంపిలే తీసుకోకుండా, బ్లడ్ రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చిందని ఈగల్ ఎస్పీ ప్రకటించడం. చివరికి రిమాండ్ రిపోర్టులో కూడా ఎక్కడ కూడా బ్లడ్ టెస్ట్ ప్రస్తావన లేదు. కేవలం యూరిన్ టెస్టు అని మాత్రమే ఉంది. మరి బ్లడ్ టెస్ట్ చేయకుండానే పాజిటివ్ వచ్చింది అని ఎస్పీ ఎలా చెప్పారు ? ఇక్కడ అనేక సందేహాలు.. అనేక అనుమానాలు... పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా? ఏలూరు ఎంపీ యూరిన్ శాంపిల్ ఎక్కడికి తీసుకెళ్లారు? పాజిటివ్ రావడం కోసం అందులో ఏదైనా కలిపారా? అయితే ఏలూరు ఎంపీ పై డ్రగ్ ముద్ర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఎస్పీ గిరిధర్ ఒకచోట పప్పులో కాలువేసారు. అదే.. బ్లడ్ టెస్ట్ లో ఏలూరు ఎంపీ కి పాజిటివ్ వచ్చిందని చెప్పడం. ఇక్కడే కచ్చితమైన కుట్ర ఉందని, ఇందులో ఈగల్ ఎస్పీ గిరిధర్ పాత్ర ఉందని అనుమానాలకు బలం చేకూరుతోంది . బ్లడ్ శాంపిల్ తీసుకోకుండానే, బ్లడ్ రిపోర్టులో పాజిటివ్ వచ్చిందని చెప్పిన ఎస్పీ, అదే నిజమైతే బ్లడ్ శాంపిల్ రిపోర్టు బయటపెట్టాలి.పొలిసు విచారణ ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ఎంపీ రెండు గుర్తింపు పొందిన ప్రముఖ ల్యాబుల్లో ?సొంతంగా యూరిన్ టెస్టు చేయించినట్లు తెలిసింది. .. ఆ రిపోర్టు కాపీలను కూడా మనకు దొరికాయి. వీటిలో "నెగెటివ్" గా రిపోర్టు రావడం మీరు చూడొచ్చు... వీటితోపాటు, ఎంపీ పై కుట్ర కోణం అనుమానాలు రేగటానికి మరో బలమైన కారణం ఉంది.అదే, ఎంపీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం. ఇది కూడా మనకు వచ్చింది.నాలుగేళ్ళ కిందట ఎంపీకి హార్ట్ ఆపరేషన్ జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టులు కూడా ఉన్నాయిఅయన ఇప్పటికీ రెగ్యులర్ గా మందులు వాడుతున్నారు. గుండె సమస్య ఉన్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్స్ వాడటం సాధ్యమేనా? సాధారణ మనిషి గుండె నిమిషానికి 70 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. డ్రగ్స్ తీసుకున్నప్పుడు 150 నుంచి 200 వరకూ వెళ్ళిపోతుందని వైద్యులు చెబుతారు... మరి గుండె సమస్య ఉన్న వ్యక్తి డ్రగ్స్ తీసుకోవడం ఏ విధంగా సాధ్యం?

ఇప్పుడు తేలాల్సిన విషయాలు

1) ఎంపీ పై డ్రగ్ ముద్ర వేయాలనే కుట్ర వెనుక ఎవరున్నారు?

2) అసలు తలసాని అల్లుడు అని తెలుసుకున్న తర్వాతే ఎస్పీ 2వ సారి టెస్ట్ కు ఆదేశించారా? దానికి కారణం ఏంటి?

3) ఎస్పీ ఏలూరు ఎంపీ గురించి.. తలసాని అల్లుడు అంటూ ఫోన్ లో చెప్పిందేవరికి?

4) పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా?

5) 2వ సారి కూడా యూరిన్ టెస్ట్ చేసి, బ్లడ్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిందని ఎందుకు చెప్పాల్సివచ్చింది?

6) అసలు బ్లడ్ టెస్ట్ చేస్తే రిమాండ్ రిపోర్ట్ లో, ఈఎఫ్ఐ లో బ్లడ్ టెస్ట్ గురించి ఎందుకు రాయలేదు.

7) కొకైన్ తీసుకున్నారని ఒక పక్క పోలీసులు చెబుతూ, ఈఎఫ్ఐ లో కొకైన్ తీసుకున్న ఆనవాళ్లు లేవని చెప్పటం కుట్ర కాదా?

8) యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళ్లు ఏవిధంగా నిర్ధారించారు ?

9) గుండె సంబంధిత, ఒబెసిటీ, డిప్రెషన్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలకు వాడే మందుల వాళ్ళ కూడా యాంఫిటమిన్ , మెథా యాంఫిటమిన్ వంటి ఆనవాళ్లు కనిపించే అవకాశం ఉందని తెలిసి కూడా డ్రగ్స్ తీసుకున్నారని ఎలా ప్రకటించారు ?

10. గుండె ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్ తీసుకుంటే బతుకుతాడా?

11. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ పై చేసిన కుట్ర వెనుక అసలు సూత్రధారులెవరు? పాత్రధారులెవరు?

12. రాజకీయ చదరంగంలో చేయని నేరానికి ఏలూరు ఎంపీ బలయ్యారా?

## ఇచ్చిన హామీలే కాదు, ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తుంది కూటమి ప్రభుత్వం

### డిసిసిబి ఛైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు ,కడప జిల్లా,బద్వేల్ నియోజకవర్గం,బద్వేల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెడుతున్న దివ్యాంగ శక్తి పథకం బద్వేల్ లో అట్టహాసంగా ప్రారంభించిన కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆర్డీవో చంద్రమోహన్ ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉగాది కానుకగా, రాష్ట్రంలోని 11.16 లక్షల దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని నేడు మంగళగిరిలో కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించింది కూటమి ప్రభుత్వం. శారీరక-మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుంది. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ధి చేకూరుతుందిదివ్యాంగ శక్తి పథకం ద్వారా 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు లబ్ది చేకురనుంది. దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50 శాతం టిక్కెట్ రాయితీ ఇవ్వనున్నారని తెలియజేశారు.దివ్యాంగులతో పాటు డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ,బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ బస్సులో జిల్లా సరిహద్దు ప్రాంతం పిపి కుంట వరకు ప్రయాణం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్ర మోహన్ గారు,బద్వేలు డిపో మేనేజర్ కన్యాకుమారి గారు,యూనియన్ చైర్మన్ ఓబులేసు,తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, పోతిరెడ్డి రెడ్డియ్య, పోరుమామిళ్ల మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్

# నయా స్టైల్ 'టమాటో పూదీనా చట్నీ'..



చాలామందికి టమాటో పచ్చడి అంటే ఇష్టం ఉంటుంది. ఇంట్లో కూరలు లేనప్పుడు.. మిగతా కర్రీలు తినాలని అనిపించనపుడు ఈ పచ్చడిని చేసుకుంటూ ఉంటారు. టమాటో పచ్చడి లంచ్ బాక్స్ లోనూ భలే కమ్మగా ఉంటుంది. టమాటో పచ్చడిలో కాస్త పూదీనా యాడ్ చేస్తే ఆ టేస్టు ఇంకా బాగుంటుంది. మరి సూపర్ టేస్టీ టమాటో పూదీనా చట్నీ తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఈ పచ్చడిని ఎలా తయారు చేసుకోవాలి..? టమాటో పూదీనా చట్నీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. టమాటోలు, చింతపండు, పూదీనా, పచ్చిమిర్చి, ఆవాలు, నువ్వులు, జీలకర్ర, మినపప్పు, శనగపప్పు, నూనె, ఉప్పు తగినంత తీసుకోవాలి. ఇప్పుడు ఈ చట్నీ తయారీ విధానం చూస్తే.. ముందుగా స్టవ్ ఆన్ చేసి దానిపై గిన్నె పెట్టుకోవాలి. అందులో నువ్వులు వేసి వేయించుకోవాలి. తర్వాత వాటిని మిక్సీ జార్ లో వేసి గ్రైండింగ్ చేసుకోవాలి. ఇప్పుడు అదే గిన్నెలో తగినంత నూనె వేసి వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో జీలకర్ర, పచ్చిమిర్చి, వెల్లుల్లి వేసి బాగా వేయించుకోవాలి. ఇవి వేగిన తర్వాత ఆ మిశ్రమంలో టమాటో ముక్కలు, చింతపండు, రుచికి సరిపడా ఉప్పు వేసి దగ్గరకు అయ్యేంత వరకూ మగ్గించుకోవాలి. టమాటోలు మగ్గిన తర్వాత ఆ మిశ్రమంలోనే పూదీనా ఆకులు వేయాలి. మరో 2 నిమిషాలు వేయించుకోవాలి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. మరిన్ని కనుగొనండి క్రీడా వార్తలు విద్య ఉద్యోగ సమాచారం రాజకీయ విశ్లేషణ జిల్లా వార్తలు బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ ఆ తర్వాత టమాటో మిశ్రమం చల్లారిన తర్వాత దీనిని మిక్సీ జారులో వేసి బరకగా అయ్యేంత వరకూ మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు తాళింపు చేసుకోవాలి. తాళింపు కోసం స్టవ్ పైన పాన్ పెట్టుకోవాలి. అందులో ఆవాలు, మినపప్పు, శనగపప్పు వేయించుకోవాలి. ఇప్పుడు ఆ తాళింపులో మిక్సీ పట్టిన టమాటో పేస్టును వేసి ఆ తర్వాత నువ్వుల పొడి కూడా వేయాలి. నూనె పైకి తేలిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అంతే సూపర్ టేస్టీ టమాటో పూదీనా చట్నీ రెడీ అయినట్టే..

# హోటల్ స్టైల్ "చికెన్ ఫ్రైడ్ రైస్" ఇంట్లోనే ఈజీగా ఎలా చేయాలంటే..?




ఇంట్లోనే సులభంగా, రెస్టారెంట్ స్టైల్‌లో రుచికరమైన చికెన్ ఫ్రైడ్ రైస్ తయారు చేసుకోవచ్చు. సరైన టెక్నిక్, హై ఫ్లేమ్ వంట, సరైన పదార్థాల వినియోగంతో మీరు కూడా బయట తినే టేస్ట్‌ను ఇంట్లోనే పొందవచ్చు. తక్కువ సమయంలో రెడీ అయ్యే ఈ డిష్, పిల్లలు నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చుతుంది. లంచ్ లేదా డిన్నర్‌కు బెస్ట్ ఆప్షన్ గా నిలవడమే కాకుండా ఒక్కసారి ట్రై చేస్తే మళ్లీ మళ్లీ చేయాలనిపిస్తుంది. చిట్కాలు.. తాజా అన్నం కంటే ఫ్రిజ్‌లో ఉంచిన అన్నం వాడితే గింజలు విడిగా ఉంటాయి. ఫ్రైడ్ రైస్‌కు రెస్టారెంట్ టేస్ట్ రావాలంటే హై ఫ్లేమ్‌లో త్వరగా వండాలి. అలానే ఎక్కువ అన్నం ఒకేసారి వేస్తే సరిగా టాస్ అవదు.. అవసరమైతే బ్యాచ్‌లుగా చేయండి. ఎక్కువ సాస్ వేసితే అన్నం తడిగా అవుతుంది కానీ రెస్టారెంట్ ఫ్లేవర్ కోసం కొద్దిగా వేసుకోవచ్చు. తక్కువ నూనె వాడితే అన్నం అంటుకునే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా గరం మసాలా చిటికెడు వేసి ఇండియన్ టచ్ ఇవ్వొచ్చు. ఇక చికెన్ బదులు ప్రాన్స్, ఎగ్ మాత్రమే లేదా పన్నీర్ కూడా వాడవచ్చు. కావలసిన పదార్థాలు.. అన్నం: 2-3 కప్పులు (ముందురోజు వండి చల్లార్చినది అయితే బెటర్) చికెన్: 150-200 గ్రాములు (చిన్న ముక్కలుగా కోసి, ఉప్పు, మిరియాల పొడితో ఉడికించినది) గుడ్లు: 2 (బీట్ చేసినవి) వెల్లుల్లి: 1 టేబుల్ స్పూన్ (సన్నగా తరిగినది) ఉల్లిపాయ: 1 (చిన్న ముక్కలుగా) క్యారెట్, క్యాప్సికమ్: తరిగినవి సోయా సాస్: 1 టీ స్పూన్ చిల్లీ సాస్: 1 టీ స్పూన్ వెనిగర్: ½ టీ స్పూన్ మిరియాల పొడి: తగినంత నూనె: 2-3 టేబుల్ స్పూన్లు ఉప్పు: తగినంత స్ప్రింగ్ ఆనియన్స్: గార్నిష్ కోసం ' తయారీ విధానం.. మొదట పాన్‌లో కొద్దిగా నూనె వేసి వేడి అయ్యాక చికెన్ ముక్కలను వేసి 3-4 నిమిషాలు వేయించి పక్కన పెట్టాలి. అదే పాన్‌లో బీట్ చేసిన గుడ్లను వేసి స్క్రంబుల్ చేసి పక్కన పెట్టుకోవాలి.

# సగ్గుబియ్యం దోసెలు.. ఇలా చేసి తింటే సూపర్ టేస్ట్!




సాధారణంగా మనం తినే అల్పాహారం రొటీన్ గా ఉంటుంది. ఇక రొటీన్ కు భిన్నంగా, ఇడ్లీ, దోసె వంటి వాటికి బదులుగా కొన్ని రకాల అల్పాహారాలు రుచిని ఇవ్వడమే కాకుండా, మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. అటువంటి అల్పాహార లో సగ్గుబియ్యం దోసెలు ఒకటి. సగ్గుబియ్యం దోసెలు ఈ సగ్గుబియ్యం దోసెలను ఏ విధంగా తయారు చేయాలి? వాటిని తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి? సగ్గుబియ్యం దోసెల రుచి ఏ విధంగా ఉంటుంది? అనేది తెలుసుకుందాం. సగ్గుబియ్యం దోసెలు బయట కరకరలాడుతూ, లోపల చాలా మృదువుగా ఉంటాయి. ఇక సగ్గుబియ్యం దోసెలను ఏ విధంగా తయారు చేయాలో చూద్దాం. కావలసిన పదార్థాలు సగ్గుబియ్యం - ఒక కప్పు బియ్యం- ఒక కప్పు పెరుగు- అర కప్పు ఆలుగడ్డ ముక్కలు- నాలుగు చెక్కు తీసి కట్ చేసి పెట్టుకున్నవి ఉప్పు- తగినంత నూనె- దోసెలు తయారీ కోసం నీరు- అవసరానికి సరిపడా తయారీ విధానం ముందుగా సగ్గుబియ్యాన్ని, బియ్యాన్ని వేరువేరుగా 5 నుండి 6 గంటల పాటు నానబెట్టుకోవాలి. తర్వాత వాటిని మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమంలో పెరుగు ఉప్పు వేసి బాగా కలిపి ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు పులియనివ్వాలి. ఇక దోశ పిండి లాగా దీని చిక్కదనాన్ని చూసుకోవాలి. బాగా గట్టిగా ఉంటే కొద్దిగా నీరు పోసుకుని కలుపుకోవాలి. దోసెలు ఇలా కాల్చుకోవాలి దోసెలు వేయడానికి పాన్ పొయ్యి మీద పెట్టి, పాన్ వేడి అయిన తర్వాత పిండిని వేసి దోసెలా అని పలుచగా రుద్దాలి. ఆ తర్వాత కొద్దిగా నూనె వేసి దోసెల మాదిరిగానే కాల్చుకోవాలి. రెండు వైపులా గోల్డెన్ కలర్ వచ్చేవరకు కాల్చుకోవాలి. అంతే రుచికరమైన సగ్గుబియ్యం దోసెలు రెడీ. రొటీన్ కు భిన్నంగా టిఫిన్ చెయ్యాలంటే ఈ సగ్గుబియ్యం దోసెలు ఈ దోసెలను కొబ్బరి చట్నీతో కానీ, పల్లి చట్నీ తో కానీ, అల్లం చట్నీతో కానీ పెట్టుకుని తింటే చాలా రుచిగా ఉంటాయి. రొటీన్ కి భిన్నంగా టిఫిన్ చేసుకోవాలనుకునే వారు ఈ సగ్గుబియ్యం దోసెలను ట్రై చేయొచ్చు. ఒక్కసారి తింటే మీరే మళ్ళీ మళ్ళీ చేసుకుంటారు.

# ఎల్లో పుచ్చకాయ.. పోషకాల గని



వేసవిలో డీహైడ్రేషన్ కు గురి కాకుండా ఉండేందుకు చాలా మంది పుచ్చకాయను ఆశ్రయిస్తుంటారు. ఇందులో ఉండే నీటి శాతం డీహైడ్రేషన్ కు ఇట్టే చెక్ పెడుతుంది. అన్ని పుచ్చకాయలు ఒకేలా ఉండవు. సాధారణంగా పుచ్చకాయ అనగానే ఎరుపు రంగుతో నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఇప్పుడు పసుపు పుచ్చకాయ కూడా విరివిగా లభిస్తోంది. చూడచక్కని రంగు, అద్భుత పోషక విలువలను కలిగివుండటం దీని ప్రత్యేకత. ఎరుపు గుజ్జులా కాకుండా పసుపు పుచ్చకాయలో సహజ వర్ణద్రవ్యాల ద్వారా వచ్చే బంగారు పసుపు రంగు ఉంటుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం పసుపురంగు పుచ్చకాయ కూడా చలువ చేస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. అనేక పోషకాలను అందిస్తుంది. పసుపు పుచ్చకాయ ద్వారా అందే అతిపెద్ద ప్రయోజనాల్లో ఒకటి- దాని అధిక విటమిన్ కంటెంట్. ఇది విటమిన్ సీ, ఇతర యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటుంది. మరిన్ని కనుగొనండి టెలివిజన్ ఆర్థిక సలహా కోర్సులు జ్యోతిష్య సేవలు ఆన్‌లైన్ ఈ పోషకాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు, రోజువారీ ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో కీలకపాత్ర పోషిస్తాయి. హైడ్రేషన్.. పసుపు పుచ్చకాయ అందించే మరో ముఖ్య ప్రయోజనం. దీనిలో 90 శాతానికి పైగా నీరుండటం వల్ల, వేడి వాతావరణంలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో ఇది అద్భుతమైనది. సరైన ద్రవశాతం ఉష్ణోగ్రత నియంత్రణ, జీర్ణక్రియ, శక్తి స్థాయిలతో శరీరాన్ని బ్యాలెన్స్ గా ఉంచుతుంది. ఈ పండులో బీటా కెరోటిన్ కూడా లభిస్తుంది. ఇది చర్మం, కళ్ళ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. శరీరంలో ఇది విటమిన్ ఏగా మారి, ఆరోగ్యకరమైన దృష్టికి, చర్మం నిగారింపునకు సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి కూడా పసుపు పుచ్చకాయ మేలు చేస్తుంది. ఇది పొటాషియం, మెగ్నీషియం వంటి అవసరమైన ఖనిజాలను కలిగి ఉంటుంది. ఈ పోషకాలు రక్తపోటును నియంత్రించి, గుండె పనితీరుకు మద్దతు ఇస్తాయి. కాలక్రమేణా గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ంటలవతీబితిబవఎవనిబి క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం సైతం మెరుగుపడుతుంది. పసుపు పుచ్చకాయలో పీచు పదార్థం (డైటరీ ఫైబర్) ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం శ్రేయస్కరం. పసుపు పుచ్చకాయ వంటి రకాలను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు అందుతాయి. శరీరాన్ని రిఫ్రెష్‌గా, హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు.



# వేసవిలో ఎక్కువగా ఫ్రిజ్ వాటర్ తాగుతున్నారా - అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!



ఎండాకాలం వచ్చిందంటే చాలా మంది కూల్ వాటర్ తాగుతుంటారు. ఆఫీసులు, బైట నుంచి రాగానే నేరుగా ఫ్రిజ్ ల దగ్గరకు వెళ్లి చల్లని నీళ్లు తాగుతుంటారు. చల్లని నీళ్లు తాగడం వల్ల.. జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. ఫ్రిజ్ లో బాటిళ్లలో చల్లని నీళ్లు నింపేసి, ఎంత కూల్ గా ఉన్న కూడా అవే నీళ్లను తాగుతుంటారు. చల్లని నీళ్లను ఎక్కువగా తాగడం వల్ల తమ గుణాలను కోల్పోతాయి. క్రమంగా గ్యాస్ట్రిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. ఇది ఇమ్యునిటిపై కూడా ప్రభావం చూపిస్తుంది. అయితే, వేసవిలో ప్రిజ్ నీరు తాగటం పైన నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. వేసవి లో శరీరం డీ హైడ్రేట్ కాకుండా చూసుకోవటం చాలా అవసరం. ఇందు కోసం తగినంత నీరు తీసుకోవాలి. మండే ఎండల్లో పదే పదే గొంతు ఎండుకుపోతూ ఉంటుంది. ఇప్పుడు దాదాపు ప్రతి ఇంట్లో ఫ్రిజ్ ఉపయోగిస్తుండటం వల్ల మరో ఆలోచన చేయకుండా కూలింగ్ వాటర్ తాగేస్తున్నారు. ఫ్రిజ్‌లో కూలింగ్ చేసిన నీరు ఎండాకాలంలో తాగితే ఏం కాదని చాలామంది అభిప్రాయం. కాగా, మనకు సరిపడతాయో లేదో తెలుసుకోకుండా ఫ్రిజ్ నీళ్లు తాగితే ఈ కింది దుష్ప్రభావాలు తప్పవు. ఫ్రిజ్ లో నీటిని రెగ్యులర్ గా తీసుకోవటం వలన మలబద్ధకం, అజీర్తి సమస్యలు రావచ్చు. మనకు తెలియని అనారోగ్య సమస్యలు ఏవైనా ఉన్నప్పుడు కూలింగ్ వాటర్ మరింత హానికరంగా మారుతుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వుకు చల్లటి నీరు తోడైతే కొవ్వు శాతం మరింత పెరుగుతుంది. చల్లటి నీరు కొంతమందికి అస్సలు సరిపోదు. అలాంటివారికి తాగిన వెంటనే గొంతు నొప్పిగా రావచ్చు. అప్పటికే గొంతు నొప్పి లేదా మరేదైనా సమస్య ఉన్నవారు చిల్లింగ్ వాటర్ తాగకపోవడమే మేలు. మరిన్ని కనుగొనండి వార్తాపత్రికలు చందాలు ట్రావెల్ గైడ్ స్పోర్ట్స్ పరికరాలు ఆన్‌లైన్ టీవీ మనీ మేనేజ్‌మెంట్ చిట్కాలు కోల్డ్ వాటర్ ఎక్కువగా తీసుకుంటే.. జరిగేది ఇదే అదే విధంగా కొందరికి పదే పదే తలనొప్పి వస్తూ ఉంటుంది. ఇలాంటి వారు చల్లటి నీటిని తాగితే మెదడు స్తంభించిపోయే ప్రమాదముంది. కూలింగ్ వాటర్ వెన్నెముకలోని సున్నితమైన నరాలను చల్లబరిచి మెదడుపై ప్రభావం పడుతుంది. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ విషయాన్ని తప్పక గుర్తుంచుకోవాలి. తీవ్రమైన ఎండల్లో చల్లని నీరు తాగాలనే కోరిక కలిగిన వెంటనే నియంత్రించుకునేందుకు ప్రయత్నించండి. చల్లటి నీరు రక్త నాళాలు వ్యాకోచించేలా చేస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రమాదం. ఫ్రిజ్ నీళ్లు తాగిన ప్రతి ఒక్కరికీ పై సమస్యలు వస్తాయని చెప్పటం లేదంటున్న నిపుణులు.. రెగ్యులర్ గా తీసుకోవటం ద్వారా దీర్ఘకాలంలో దుష్ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఫ్రిజ్ వాటర్ తాగిన తరువాత శరీరంలో ఏదైనా సమస్య ఉన్నట్లు గుర్తిస్తే.. దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు.



# సమ్మర్ స్పెషల్ "పెరుగు చట్నీ" ఎలా చేయాలంటే..?

వేసవి కాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే వంటకాలలో పెరుగు ముఖ్యమైనది. పెరుగుతో తయారుచేసే పెరుగు చట్నీ లేదా రాయితా చాలా సులభంగా, తక్కువ సమయంలో తయారయ్యే రుచికరమైన సైడ్ డిష్. ఇది అన్నం, బిర్యానీ, పులావ్, రోటీ, పరాటా వంటి వంటకాలతో చాలా బాగా సరిపోతుంది. కేవలం 5 నుంచి 10 నిమిషాల్లోనే ఈ రాయితాను తయారుచేసుకోవచ్చు. అంతే కాకుండా పెరుగు చట్నీ కేవలం రుచికరమైన వంటకం మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శరీరానికి చల్లదనం ఇస్తుంది, అలాగే ప్రోటీన్లు మరియు కాల్షియం కూడా అందిస్తుంది. పెరుగు చట్నీకి వేరియేషన్లు.. దోసకాయ రాయితా: తురిమిన దోసకాయను ఎక్కువగా కలిపితే వేసవిలో చాలా చల్లదనాన్ని ఇస్తుంది.: చిన్న బూంది కలిపితే బిర్యానీతో బాగా సరిపోతుంది. పుదీనా రాయితా: పుదీనా ఆకులు వేసి కలిపితే మంచి సువాసన వస్తుంది. టమాటా రాయితా: సన్నగా తరిగిన టమాటా కలిపినా మంచి రుచి వస్తుంది.మరిన్ని కనుగొనండి పెరుగులో పెరుగు పెరుగుతో చట్నీ పచ్చడి కొత్తిమీర కొత్తిమీరను బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ పెరుగు చట్నీకి కావలసిన పదార్థాలు.. చిక్కటి పెరుగు - 1 కప్పు సన్నగా తరిగిన ఉల్లిపాయ - 1 చిన్నది పచ్చిమిర్చి - 1 లేదా 2 కొత్తిమీర - కొద్దిగా తురిమిన క్యారెట్ - 2 టేబుల్ స్పూన్లు (ఐచ్ఛికం) దోసకాయ ముక్కలు - 2 టేబుల్ స్పూన్లు (ఐచ్ఛికం) ఉప్పు - తగినంత వేయించిన జీలకర్ర పొడి - అర టీస్పూన్ పోపు కోసం నూనె - 1 టీస్పూన్ ఆవాలు - అర టీస్పూన్ జీలకర్ర - అర టీస్పూన్ కరివేపాకు - కొన్ని ఆకులు ఎండుమిర్చి - 1 జనీబీ ఓజీఎ పెరుగు చట్నీ తయారీ విధానం.. మొదట ఒక గిన్నెలో 1 కప్పు చిక్కటి పెరుగు తీసుకోవాలి. అందులో గడ్డలు లేకుండా ఉండేలా స్పూన్ లేదా విస్క్‌తో బాగా చిలకరించాలి. ఇలా చేస్తే రాయితా మృదువుగా ఉంటుంది. ఇప్పుడు సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీరను పెరుగులో వేసి బాగా కలపాలి. కావాలంటే తురిమిన క్యారెట్, దోసకాయ ముక్కలు కూడా కలిపితే రాయితా మరింత రుచిగా ఉంటుంది. ఈ మిశ్రమంలో తగినంత ఉప్పు, వేయించిన జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. ఇది రాయితాకు మంచి వాసనతో పాటు ప్రత్యేక రుచిని ఇస్తుంది. చిన్న పాన్‌లో ఒక టీస్పూన్ నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి వేసి చిటపటలాడే వరకు వేయించాలి. ఈ పోపును వెంటనే పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. రాయితాను కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచితే ఇంకా చల్లగా, రుచిగా ఉంటుంది. అనంతరం అన్నం, బిర్యానీ లేదా రోటీలతో వడ్డించవచ్చు. చిట్కాలు.. పెరుగు ఎక్కువగా పుల్లగా లేకపోతే రాయితా రుచి ఇంకా బాగుంటుంది. మరింత రుచికోసం చిటికెడు చాట్ మసాలా లేదా మిరియాల పొడి కలిపవచ్చు. వేయించిన శనగపప్పు పొడి కొద్దిగా కలిపితే రాయితాకు కొత్త రుచి వస్తుంది. పిల్లలకు ఇవ్వాలంటే పచ్చిమిర్చి పరిమాణాన్ని తగ్గించడం మంచిది. గట్టిగా ఉన్న పెరుగు ఉంటే కొద్దిగా నీరు లేదా మజ్జిగ కలిపి సన్నగా చేసుకోవచ్చు.






# రోహిత్ అభిమానులకు అదిరిపోయే న్యూస్..



ఐపీఎల్‌కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 28 నుంచి ఈ క్యాష్ రిచ్ లీగ్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. తొలి మ్యాచ్ బెంగళూరు, హైదరాబాద్ జట్ల మధ్య జరగనుంది. ఇది ఇలా ఉంటే.. తాజాగా టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ అభిమానులకు అదిరిపోయే న్యూస్ ఒకటి వచ్చింది. ముంబై ఇండియన్స్ జట్టులో రోహిత్ స్థానం ఏమిటి అనే విషయంపై ఆ జట్టు హెడ్ కోచ్ మహేల జయవర్ధనే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో రోహిత్ శర్మను 'ఇంపాక్ట్ ప్లేయర్'గా ఉపయోగించే ఆలోచన లేదని, అతను పూర్తిస్థాయి ఆటగాడిగా గ్రౌండ్?లో ఉంటాడని జయవర్ధనే స్పష్టం చేశాడు. ఇటీవలి కాలంలో రోహిత్ టీ20 క్రికెట్ ఆడనందున, అతడిని ఎలా ఉపయోగించుకోవాలని యోచిస్తున్నారని మీడియా అడగ్గా.. ' రోహిత్ శర్మ బాగా కష్టపడుతున్నాడు. గత వారం రోజులుగా తన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి చాలా సాధన చేశాడు. శిక్షణా శిబిరం తొలి రోజే మాతో చేరిన అతను నెట్స్‌లో చాలా బాగా ఆడాడు. కొత్త తరం రోహిత్‌లా, మరింత ఫిట్‌గా, ఎంతో నిబద్ధతతో కనిపించాడు. కాబట్టి, అతనే జట్టును నడిపించాలని మేము ఎదురుచూస్తున్నాం' అని తెలిపాడు.'గతేడాది రోహిత్ శర్మచిన్న చిన్న గాయాలతో బాధపడ్డాడు. అందుకే అతడిని మేము ఇంపాక్ట్ ప్లేయర్ గా ఉపయోగించాము. మైదానంలో ఉన్నా లేకపోయినా అతడి ప్రభావం జట్టుపై కచ్చితంగా ఉంటుంది. కానీ ఈ ఏడాది సీజన్‌లో మాత్రం రోహిత్‌ను కచ్చితంగా ఎక్కువ సమయం మైదానంలోనే ఉంచుతాం. అయితే జట్టులో ఎక్కువ మంది ఆల్‌రౌండర్లు ఉన్నందున.. మ్యాచ్ పరిస్థితుల బట్టి ఇంపాక్ట్ ప్లేయర్‌ను రోటేట్ చేస్తాం' అని జయవర్ధనే పేర్కొన్నాడు. ఈ ఏడాది సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది.

# బుమ్రా కాంట్రాక్ట్‌పై బీసీసీఐ పునరాలోచన!

బీసీసీఐ ఇటీవలే టీమిండియా ప్లేయర్ల కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంతకుముందు ఉన్న ఏ ప్లస్ కేటగిరినీ బీసీసీఐ పూర్తిగా తొలగించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ఈ కేటగిరీలోనే ఉండేవారు. వారికి ఏడాదికి రూ.7 కోట్లను బోర్డు పారితోషికంగా చెల్లించేది. అయితే ఏ ప్లస్ కేటగిరీని తొలగించడంతో బుమ్రా ఏ కేటగిరీకి వచ్చాడు. దీనికి రూ.5 కోట్లు మాత్రమే బోర్డు చెల్లించనుంది. దీంతో అన్ని ఫార్మాట్లలో ఆడుతున్న బుమ్రా దాదాపు రూ.2 కోట్లను కోల్పోతున్నాడు.బుమ్రా కాంట్రాక్ట్‌పై బీసీసీఐ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అతడు నష్టపోతున్న రూ.2కోట్లను పరిహారంగా కింద బీసీసీఐ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో పాటు మరికొందరు ఆటగాళ్ల ప్రదర్శనను కూడా దృష్టిలో పెట్టుకుని వారి కాంట్రాక్టు మొత్తాలను కూడా బీసీసీఐ పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై బీసీసీఐ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. టీమిండియా టీ20 ఫార్మాట్ వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా బీసీసీఐ పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్షర్ ప్రస్తుతం గ్రేడ్ సిలో ఉన్నాడు. అతడు కేవలం రూ.కోటి మాత్రం అందుకుంటున్నాడు.అయితే గతంలో ఏ ప్లస్ కేటగిరీ దక్కించుకోవాలంటే క్రికెటర్లు మూడు ఫార్మాట్లలో ఆడుతూ, కనీసం ఒక్క ఫార్మాట్లో అయినా టాప్ 10 ర్యాంకింగ్‌లో ఉండాలనే నిబంధన ఉండేది. విరాట్, రోహిత్ శర్మ టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు బీ కేటగిరీలో ఉన్నారు. కాగా ఏ కేటగిరీలో శుభ్‌మన్ గిల్, జడేజా, బుమ్రా కొనసాగుతున్నారు.



# 'సన్‌రైజర్స్' వివాదం.. రంగంలోకి దిగిన లలిత్ మోదీ!

విదేశీ లీగ్ 'ది హండ్రెడ్' వేలంలో పాక్ ప్లేయర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సన్‌రైజర్స్ ఓనర్ కావ్యా మారన్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఐపీఎల్‌లో ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలంటూ అభిమానులు ట్వీట్లు పెడుతున్నారు. ఐపీఎల్ ఆరంభానికి ముందు ఈ వివాదం తీవ్ర చర్చకు దారి తీసింది. పలువురు మాజీ క్రికెటర్లు కూడా దీనిపై ఘాటుగా విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త లలిత్ మోదీ ఈ విషయంపై స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.'ది హండ్రెడ్ లీగ్ వేలంలో భాగంగా పాక్ ప్లేయర్ అబ్రార్‌ను రూ.2.34 కోట్లు పెట్టి సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. ఈ విషయంపై అభిమానులు ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్‌లో రాజకీయ జోక్యం ఉండకూడదు. స్వదేశంలో ఐపీఎల్ లాంటి టోర్నీల్లో పాక్ ప్లేయర్లను భారత్ తీసుకోవడం లేదు.. కానీ 'ది హండ్రెడ్' అనేది విదేశీ లీగ్. అక్కడ పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంలో తప్పేమీ లేదు. దీన్ని ఎలా హ్యాండిల్ చేయాలో నాకు తెలుసు. కాల్ మీ' అని ఎక్స్‌లో లలిత్ మోదీ పేర్కొన్నారు. వివాదంలో ఉన్న కావ్యా మారన్‌కు మద్దతుగా, ఆమెకు సాయం చేయడానికే ఆయన ఈ పోస్ట్ పెట్టినట్టు తెలుస్తోంది.ఇదిలా ఉండగా లలిత్ మోదీ 2010లో ఐపీఎల్‌కు సంబంధించిన ఆర్థిక అక్రమాల ఆరోపణల నేపథ్యంలో దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే. ఆయన ప్రస్తుతం యూకేలో ఉంటున్నారు. ప్రసార హక్కుల కేటాయింపులో అవకతవకలు, భారీ కిక్ బ్యాక్ ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. అయితే తాజా వ్యాఖ్యలతో ఆయన మళ్లీ వార్తల్లోకి రావడం వల్ల సన్‌రైజర్స్ తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చ మరింత ముదిరేలా చేసింది.



# ఐపీఎల్ సందడి షురూ.. ఆరంభ మ్యాచ్‌లకు ఆసీస్ పేస్ జోడీ దూరం




ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) సందడి మొదలైంది. మరో పది రోజుల్లో మొదలుకానున్న 19వ సీజన్ కోసం జట్లన్నీ అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ కోసం ఆయా జట్ల క్రికెటర్లు సన్నాహాలు షురూ చేశారు. దేశవాళీ క్రికెటర్లు ఇప్పటికే ప్రాక్టీస్‌లో చెమటోడుస్తుండగా, అంతర్జాతీయ క్రికెటర్లు తమ తమ ఫ్రాంచైజీలతో చేరుతున్నారు. సీజన్‌కు ముందు డిఫెండింగ్ చాంపియన్ ఆర్‌సీబీకి హాజిల్‌వుడ్ రూపంలో ఎదురుదెబ్బ తాకగా, ఎస్ఆర్‌హెచ్ కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. గత సీజన్ల లాగే చెన్నై ఐకాన్ ధోనీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు వెలువడుతుండగా, 'ముంబై చా రాజా' రోహిత్‌శర్మ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. రాజస్థాన్ రాయల్స్‌తో తన బంధాన్ని తెంచుకున్న చెటా సంజూ శాంసన్..ఈసారి చెన్నై తరఫున అదరగొట్టేందుకు సై అంటున్నాడు.తన కెరీర్ ఆరంభం నుంచి నిరుటి సీజన్ దాకా ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన మాజీ సారథి సంజూ శాంసన్ ఆ జట్టును వీడటానికి గల కారణాలపై తొలిసారిగా నోరువిప్పాడు. శాంసన్ మాట్లాడుతూ.. 'రాజస్థాన్ ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బందిలో చాలామందితో నాకు సత్సంబంధాలున్నాయి. నా కెరీర్‌లో రాయల్స్‌కు వ్యతిరేకంగా ఆడుతుండటం ఇదే మొదటిసారి. కానీ మైదానంలో భావోద్వేగాలు నా ఆటను ప్రభావితం చేయలేవు.రాయల్స్‌లో నా సమయం ముగిసిందని నేను భావించా. అందుకే ఆ జట్టు నుంచి బయటకు వచ్చా. ఇప్పుడు మేం ముఖాముఖి ఎదురుపడితే నేను మిగతా ప్రత్యర్థుల మాదిరిగానే ఆ జట్టుపై అత్యుత్తమ క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తా' అని తెలిపాడు. ఐపీఎల్ సీజన్ వేలానికి ముందు ట్రేడ్ డీల్ ద్వారా చెన్నైకి మారిన ఈ కేరళ స్టార్.. సూపర్ కింగ్స్ మాజీ సారథి ధోనీ నుంచి నేర్చుకునేందుకు ఇది తనకు చక్కని అవకాశమని చెప్పాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. 2వ స్థానానికి చేరుకున్న బంగ్లా ప్లేయర్




ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. వన్డే బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మెహిదీ తొమ్మిది స్థానాలు ఎగబాకి ఏడవ స్థానానికి, వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో రెండు స్థానాలు మెరుగుపరుచుకుని రెండవ స్థానానికి చేరుకున్నాడు. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో మిరాజ్ మూడు మ్యాచ్‌లలో కలిపి ఐదు వికెట్లు పడగొట్టాడు.ఇక పాకిస్థాన్‌పై తన తొలి శతకం సాధించిన బంగ్లాదేశ్ బ్యాటర్ తంజిద్ హసన్ కూడా 31 స్థానాలు ఎగబాకి 55వ స్థానానికి చేరుకోగా, లిట్టన్ దాస్ 10 స్థానాలు పైకి ఎగబాకి 82వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్ 28, ముస్తఫిజుర్ రెహమాన్ 47వ స్థానాలకు చేరుకున్నారు. బంగ్లాతో సిరీస్‌లో ఓడిపోయినప్పటికీ, పాకిస్థాన్ బ్యాటర్ సల్మాన్ అలీ అఘా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తొమ్మిది స్థానాలు మెరుగుపర్చుకుని తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. అతను వన్డే ఆల్-రౌండర్లలో 10వ స్థానంలో నిలిచాడు.టీ20ఐ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 11 స్థానాలు మెరుగుపర్చుకుని 13వ స్థానానికి చేరుకున్నాడు. అతను టీ20ఐ ఆల్ రౌండర్ల జాబితాలో ఏడవ స్థానంలో ఉన్నాడు. లాకీ ఫెర్గూసన్ టీ20ఐ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 51వ స్థానానికి చేరుకోగా, డెవాన్ కాన్వే బ్యాటర్లలో 70వ స్థానానికి చేరుకున్నాడు. భారత ఆటగాడు అభిషేక్ శర్మ టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. వరుణ్ చక్రవర్తి కూడా టీ20ఐ బౌలింగ్ చార్ట్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్: అగ్రస్థానంలోనే స్మృతి మంధాన

మహిళల జట్టు వన్డే ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన 790 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ స్థానాన్ని మెరుగుపరుచుకుని 652 పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకింది. మరో స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 635 పాయింట్లతో 12వ స్థానంలోనే ఉందితాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్ జాబితాలో టాప్ 6 బ్యాటర్ల స్థానాల్లో ఎలాంటి మార్పు లేదు. స్మృతి తర్వాతి స్థానంలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్(782), ఆసీస్ వికెట్ కీపర్ బెత్ మూనీ(749), ఆసీస్ బ్యాటర్ ఆష్లీ గార్డ్‌నర్(724), ఇంగ్లండ్ ప్లేయర్ నాట్‌సీవర్ బ్రంట్(714), ఆసీస్ బ్యాటర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్(674) పాయింట్లతో కొనసాగుతున్నారు. బౌలింగ్ విభాగంలో ఆసీస్ బౌలర్ అలానా కింగ్ 775 పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలపర్చుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో సోఫీ ఎకిల్‌స్టన్(747), ఆష్లీ గార్డ్‌నర్(713) ఉన్నారు. టీమిండియా స్టార్ దీప్తి శర్మ 614 పాయింట్లతో పదో స్థానంలో కొనసాగుతోంది.ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బ్యాటింగ్ జాబితాలో ఆసీస్ వికెట్ కీపర్ బెత్ మూనీ 787 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానంలో టీమిండియా స్టార్ స్మృతి మంధాన(770), హెలీ మ్యాథ్యూస్(765) తమ స్థానాలను పదిలపర్చుకున్నారు. బౌలింగ్ విభాగంలో టాప్ 8 స్థానాలు పదిలంగా ఉన్నాయి. అగ్రస్థానంలో పాక్ పేసర్ సాదియా ఇక్బాల్(743) ఉంది. కాగా టీమిండియా బౌలర్ అరుంధతీ రెడ్డి 697 పాయింట్లతో పదో స్థానానికి ఎగబాకింది.






# ప్రభాస్ ..ఫౌజీ దసరాకు పక్కా

## శరవేగంగా సాగుతున్న షూటింగ్




ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.



# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్

ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు.ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.

# గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్స్ట్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నారు. నెక్స్ట్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

# విడుదలకు ముందే దురంధర్ కలెక్షన్లు

## ప్రీరిలీజ్ కోసం 130 కోట్లు రాబట్టినట్లు ప్రచారం

బాక్సాఫీస్ వద్ద మరోసారి కలెక్షన్ల వర్షం సృష్టించేందుకు 'ధురంధర్ 2' సిద్ధమవుతోంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు కొల్లగొడుతోంది. 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెయిడ్ ప్రివ్యూల్లోనే కోట్లు వసూలుచేస్తోంది. ఈ కలెక్షన్లు చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' ప్రభంజనం ఏ స్థాయిలో ఉండనుందో తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య ఉగాదికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రివ్యూలు ఉండనున్నాయి. దీంతో దీని టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటిరోజు అడ్వాన్స్




బుకింగ్స్‌లో రూ.29 కోట్లు వచ్చాయని సినీ వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఓవర్సీస్‌లో సుమారు రూ.60 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయని సమాచారం.



# ఆసక్తికరంగా విశ్వనాథ్ అండ్ సన్స్ టీజర్




నువ్వు ఒక్క చిటికేస్తే నీ వయసు అబ్బాయిలు చాలా మంది ఇలా వచ్చి పడిపోతారని సూర్య చెప్పడం.. కావాలంటే ఇంకో నాలుగు చిటికెలేస్తా. నువ్వు పడు చాలు' అంటూ మమిత క్యూట్‌గా బదులివ్వడం విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు ఇదే ట్రెండ్ అవుతోంది. మనం గొప్ప అనుకున్న ప్రతిసారీ మనకన్నా గొప్పోడు ఒకడుంటాడని దేవుడు గుర్తు చేస్తాడు అంటున్నారు కథానాయకుడు సూర్య. ఇప్పుడాయన నుంచి రానున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మమితా బైజు కథానాయిక. ఈ చిత్రం జులైలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. 'సంజయ్ విశ్వనాథ్ గతంలో ఎన్నో పిస్టల్ కాంపిటేషన్స్‌లో గెలిచారు. కానీ, ఇప్పుడు వేరు. కంటి చూపుకి 20ల్లో ఉన్న ఫిట్‌నెస్ 40 దాటాక ఉండదు' అనే డైలాగ్‌తో సూర్య పాత్రను పరిచయం చేస్తూ టీజర్ సాగిన తీరు ఆద్యంతం అలరించింది. దీంట్లో మ్యాడీగా మమితా బైజు చేసిన సందడి ఆకట్టుకుంది. ఆమె వయసులో తనకంటే 20ఏళ్లు పెద్దవాడైన హీరోపై మనసు పారేసుకోవడం.. ఈ ఇద్దరి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ఈ ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. ఆఖర్లో '




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**